

వృద్ధులను ఆదరించాలి
పిల్లల ఉన్నతి కోసం తపించిన తల్లిదండ్రులను మలిదశలో ప్రేమతో ఆదరించాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు.
- 8లో ▸



కమనీయం..
డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.2 /16.4
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బస్వాపూర్‌లో ఆగిన త్రిపుర గవర్నర్



భిక్కనూరు : బస్వాపూర్ గ్రామ శివారులోని హోటల్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి కాసేపు ఆగారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఆయన హోటల్‌లో ఆగి టీ తాగారు. ఆయన వెంట ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఉన్నారు.

చిరుత సంచారం.. భయాందోళనలో ప్రజలు



లింగంపేట: కంచ్‌మల్, సీతాయిపల్లి గ్రామాల మధ్య చిరుతపులి సంచరిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు రోడ్డు పక్కన చిరుతను గమనించారు. దానిని వెంటనే వారి సెల్‌ఫోన్‌లలో బంధించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి, వెంటనే చిరుతను బంధించాలని కోరుతున్నారు.

పోచారం వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు



నాగిరెడ్డిపేట : అనారోగ్యానికి గురైన కోళ్ల రవాణాను అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులోని పోచారం వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. నాగిరెడ్డిపేట పోలీసులు, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఈ చెక్‌పోస్ట్‌ను నిర్వహించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. జిల్లాలోకి ప్రవేశించే వాహనాలతోపాటు జిల్లానుదాటి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి రవికుమార్ ఉన్నారు.

కించపరిచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి




తాడ్వాయి: దళితుడిని కించపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆయన సోమవారం బ్రహ్మజీవాడిని సందర్శించి, ఇటీవల గ్రామంలో జరిగిన ఘటనపై ఆరాతీశారు. డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ రహీమొద్దీన్ సమక్షంలో జరిగిన ఘటన గురించి బాధితుడు కూరెళ్లి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు అవుతున్నా ఇలాంటి ఘటనలు జరుగుతుండడం దురదృష్టకరమన్నారు. సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులు, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, గౌరవ అధ్యక్షుడు మల్లన్న, తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: క్రమశిక్షణతో విధులు నిర్వహించి, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కొత్త కానిస్టేబుళ్లకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌లకు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలన్నారు. విధుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కొత్తగా వచ్చిన కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్‌లో విధులు ఎలా నిర్వహించాలి, ప్రజలతో ఎలా మెలగాలి, బందోబస్తుకు వెళ్లినప్పుడు ఎలా డ్యూటీ చేయాలి, ప్రజలతో ఏ విధంగా నడుచుకోవాలి అనే విషయాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పించారు.

బీఆర్‌ఎస్‌లో బీసీ జోష్!



బీసీ డిక్లరేషన్ అమలు కోసం బీఆర్ఎస్ పోరుబాట పడుతోంది. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి గడ్డ మీదే భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఈ విషయమై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేసిన ప్రకటన గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

- బీసీ డిక్లరేషన్ అమలు కోసం పోరుబాట
- 'చలో కామారెడ్డి'కి కేటీఆర్ పిలుపు
- భారీ సభ నిర్వహించే యోచనలో పార్టీ
- ఈనెలలోనే సభ నిర్వహించే అవకాశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా అప్పటి సీఎం కేసీఆర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేటి సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేయడంతో కామారెడ్డి రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. అన్ని రాజకీయ పార్టీలు కామారెడ్డి మీదే దృష్టి సారించాయి. అధికారంలోకి వస్తే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. అధికారంలోకి వస్తే బీసీల కోసం ఏం చేస్తామో ఆ డిక్లరేషన్‌లో వివరించారు. కామారెడ్డిలో ఉద్దండులు పోటీ చేయడంతో ప్రచారం హోరాహోరీగా సాగింది. ఆ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఇద్దరు ఉద్దండులను ఓడించి జెయింట్ కిల్లర్‌గా ఆవిర్భవించారు.

రంగంలోకి గులాబీ పార్టీ..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచాయి. ఇప్పటికీ బీసీ డిక్లరేషన్ విషయంలో ముందడుగు పడలేదు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ గురించి పట్టుపడుతున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ ఈ అంశాన్ని రాజకీయాస్త్రంగా మలచుకోవాలని యోచిస్తోంది. బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్న డిమాండ్‌తో పోరాటానికి సిద్ధమవుతోంది. వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో బీసీ చైతన్య సభలు నిర్వహించిన అనంతరం కామారెడ్డి సభ నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నారు. కులగణన సర్వే నివేదిక చిత్తు కాగితంతో సమానమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపిస్తున్నారు. రీ సర్వే చేసి అసలైన లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

కామారెడ్డిలోనే సభ!

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా 'బీసీ డిక్లరేషన్ సభ' నిర్వహించింది. ఆ డిక్లరేషన్ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అదే మైదానాన్ని వేదికగా చేసుకోవాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను గుర్తు చేస్తూ, ఆ పార్టీపై ఒత్తిడి తేవడానికి బీఆర్ఎస్ చలో కామారెడ్డికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఏ రోజు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఈ నెలలోనే సభ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

పూర్వవైభవం కోసం..

రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, స్థానికంగానూ పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిస్తేజంలో ఉన్నాయి. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలు మరింత కుంగదీశాయి. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేసిన 'చలో కామారెడ్డి' ప్రకటనతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో ముఖ్యంగా కామారెడ్డి నియోజక వర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం కనబడుతోంది. సభ నిర్వహిస్తే పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్న ఆశతో వారు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కామారెడ్డిలో సభ జరిపితే పార్టీ ఊపులోకి వస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు దఫాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నందున అందుకు తగిన విధంగా అధికారులు సమాయత్తం కావాలన్నారు. స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులకు డివిజన్ స్థాయిలో బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారుల నియామకానికి ర్యాండమైజేషన్ చేపట్టి విధులు కేటాయించాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దకొడప్‌గల్ మండలం బాబుల్‌గావ్‌లో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే బుధవారంలోగా తెలియజేయాలని సూచించారు. ఈనెల 14 న తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీపీవో శ్రీనివాస్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం'



విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీజీఆర్‌ఎఫ్ ప్రతినిధులు

మాచారెడ్డి : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం చుక్కాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో కామారెడ్డి రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని మాచారెడ్డి, వెల్పుగొండ, సదాశివనగర్, రామారెడ్డి మండలాల వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నుంచి 10 ఫిర్యాదులు అందాయని, ఇందులో మూడింటిని వెంటనే పరిష్కరించామని పేర్కొన్నారు. మిగతా వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయ మోటార్ల వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఈ వేదికకు మాచారెడ్డి, వెల్పుగొండ వినియోగదారులు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రవణ్ కుమార్, డీఈ కల్యాణ చక్రవర్తి, మాచారెడ్డి ఏఈ తిరుపతిరెడ్డి, సీజీఆర్ఎఫ్ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, మర్రిపల్లి రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీరియస్‌గా తీసుకోండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

- ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపు ప్రతిష్టాత్మకం
- ఏడుగురు మంత్రులకు 42 నియోజకవర్గాల బాధ్యతలు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

కరీంనగర్ కార్పొరేషన్ : 'ఎమ్మెల్సీ ఎన్నిక మనకు ప్రతిష్టాత్మకం. ఈ ఎన్నికల్లో విజయంతోనే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి బాటలు పడతాయి. అలసత్వం వద్దు.. సీరియస్‌గా తీసుకోండి. ఆరు నియోజకవర్గాలకో మంత్రి ఇన్‌చార్జిగా ఉంటారు. ఓటింగ్‌కు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలదే బాధ్యత' అంటూ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులతో ఓ హోటల్‌లో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ఎన్నిక ఫలితం ప్రభావం చూపుతుందన్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలను ఏడుగురు మంత్రులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. మరో పదిహేను రోజులే గడువు ఉన్నందున మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు. పట్టభద్రుల అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి రోల్ మోడల్ అన్నారు. అన్ని రకాల సర్వే చేసి, తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారన్నారు. నరేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నగరంలో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి నేతలు పాల్గొన్నారు.

తెయూలో ఆరోగ్య విద్యను ప్రోత్సహిస్తాం

- వీసీ యాదగిరి రావు
- సూర్య ఆరోగ్య సంస్థతో ఎంఓయూ



సూర్య హెల్త్ ఆర్గనైజేషన్‌తో ఎంఓయూ కుదుర్చుకుంటున్న తెయూ వీసీ యాదగిరిరావు

భిక్కనూరు/తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలకు కట్టుబడి విశ్వవిద్యాలయంలో ఆరోగ్య విద్య, కౌన్సెలింగ్ సేవలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తామని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు. తెయూ సౌత్ క్యాంపస్‌లోని సోషల్ వర్క్ విభాగం, సూర్య ఆరోగ్య సంస్థ మధ్య ఎంఓయూ కుదిరింది. ఈ సందర్భంగా సోమవారం ఒప్పంద పత్రాలపై తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ చేకూరి ఉదయ సూర్యభగవాన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆరోగ్య విద్య, నిర్మాణాత్మక సంస్కరణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మానసిక, భావోద్వేగ, శారీరక శ్రేయస్సును పెంపొందించడమే ఈ ఎంఓయూ లక్ష్యం కావాలన్నారు. సంస్థ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ మాట్లాడుతూ అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా ప్రజారోగ్యం, శ్రేయస్సు మెరుగుపర్చడానికి తమ సంస్థ కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఘంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, సంస్థ సభ్యులు రవితేజ, ఆనంద్, రాజేశ్వరి, అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ట్రయథ్లాన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి ట్రయథ్లాన్ పోటీలలో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలలో 300 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఇందులో ప్రతిభ చూపిన 25 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథం తెలిపారు. రన్, త్రో, జంప్ విభాగాలలో ప్రతిభ చూపినవారికి పతకాలు, ప్రశంస పత్రాలు అందించామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18, 19 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, ప్రతినిధులు దత్తాత్రి, అతీకుల్లా, శ్రీనివాస్, శివాగౌడ్, నరేష్‌రెడ్డి, అరుణ, సరిత, సంజీవ్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఎం.హర్షవర్ధన్, జి.జీవన్, బి.సుమలత, ఎస్.భవాని, కె.గంగోత్రి, ఎం.రాము, బి.సంజు, సీహెచ్.లక్ష్మణ్, రిమ్‌షాబేగం, హెచ్.ప్రియాంక, ఎన్.నితిన్, బి.విజయ్‌సింగ్, సీహెచ్.ప్రశాంత్, కె.వంశీకృష్ణ, జి.కార్తీక్, ఎస్.రాహుల్, కె.మౌనిక, ఆర్.సంధ్య, టి.శ్రావ్య, ఎన్.సంధ్య, ఎం.రోహిత్, బి.ఈశ్వర్, డి.అనిల్‌కుమార్, ఎస్.దివ్య, ఎం.ఈశ్వర్.

ఆఖరిరోజు అట్టహాసంగా..

- ముగిసిన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ నామినేషన్లు
- ఒకేరోజు నామినేషన్ వేసిన 59 మంది అభ్యర్థులు
- రెండుస్థానాలకు కలిపి మొత్తం 117 దాఖలు
- జనసంద్రమైన కరీంనగర్ వీధులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్–మెదక్– ఆదిలాబాద్– నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ ప్రక్రియ ముగిసింది. సోమవారం నామినేషన్లకు ఆఖరురోజు కావడంతో భారీగా అభ్యర్థులు పోటెత్తారు. అనుచరులు, కార్యకర్తలు వెంటరాగా వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు 59 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 51 గ్రాడ్యుయేట్స్ కోసం రాగా.. మిగిలిన 8 టీచర్స్ స్థానానికి వచ్చినట్లు వివరించారు. మూడో తేదీన మొదలైన నామినేషన్లలో ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్స్‌కు 100, టీచర్స్ ఎమ్మెల్సీకి 17 నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరీంనగర్ నగర వీధులన్నీ ర్యాలీలతో నిండిపోయాయి. కాంగ్రెస్ తరఫున పలువురు మంత్రులు హాజరు కాగా.. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ర్యాలీల కోసం భారీగా జనసమీకరణ చేయడంతో నగర వీధులన్నీ జనసంద్రంగా మారాయి. కళాకారుల ఆటపాటలు, డప్పువాయిద్యాలతో హోరెత్తిపోయాయి.

- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి రెండోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, విప్‌లు ఆదిశ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, చింతకుంట విజయరమణరావు, మక్కాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.
- బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ట్రస్మా శేఖర్‌రావులు భారీగా అనుచరులు తరలిరాగా స్వతంత్రులుగా నామినేషన్ వేశారు. రవీందర్‌సింగ్ కేసీఆర్ చిత్రపటంతో వెళ్లి నామినేషన్ వేయడం గమనార్హం. వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే అయినా.. ఈసారి స్వతంత్రులుగా బరిలోకి దిగడం విశేషం.
- ఎస్టీయూ, టీపీఆర్టీయూ బలపరిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేశారు. ఆయన వెంట హర్షవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, షాబీర్, తిరుపతి, గజేందర్, రవి ఉన్నారు.
- టీఎస్‌యూటీఎఫ్, ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన కరీంనగర్ నియోజకవర్గ టీపీటీఎఫ్ టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్ కుమార్ నామినేషన్ వేశారు. నల్గొండ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయడానికి వస్తున్న మల్క కొమురయ్య



... రఘోత్తమరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు, నరేందర్‌రెడ్డి

బరిలో మిలియనీర్లే..

చిన్నమైల్ అంజిరెడ్డి

వ్యక్తిగత ఆస్తులు:	రూ.120.40.41.274
భార్య ఆస్తులు :	రూ.54.79.63023
	మొత్తం రూ.175 కోట్లపై చిలుకు
బంగారం వ్యక్తిగతం :	250 గ్రాములు (విలువ రూ.19.32 లక్షలు)
	భార్య పేరిట 1.850 గ్రాములు (విలువ రూ.1.43 కోట్లు)

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

వ్యక్తిగత ఆస్తులు :	రూ.30.00.59.840
భార్య పేరిట:	రూ.13.38.36.263 (ఆయన భార్యకు క్రిస్టా కారు, అరకిలో బంగారం)
	ఉమ్మడి ఆస్తులు రూ. 2 కోట్లు
	మొత్తం రూ.45.50 కోట్లు

మల్క కొమురయ్య

వ్యక్తిగత ఆస్తులు:	రూ.32.08.62.420.
ఆయన భార్యకు:	రూ.29.55.03.158
మొత్తం కలిపి:	రూ.61.63.65.578
	భార్య వద్ద 4.457 గ్రాముల బంగారం

క్లుప్తంగా

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి



ఎల్లారెడ్డి: సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బంజారా సంఘం నాయకులు సోమవారం ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, దీంతో పాటు సెలవు సైతం ప్రకటించాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు లింబేష్, గణేష్, సుభాష్, శంకర్, సంతోష్ తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేన జిల్లా అధ్యక్షుడు దేగావత్ దేవిసింగ్ రాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సదాశివనగర్‌లో మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ బ్రిటీష్ వారితో పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.

వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాల సీఎంఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో మోడల్ స్కూల్, అడివిలింగాల జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు గాంధీ, శివనర్సింహారావులు తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో మోడల్ స్కూల్ విద్యార్థిని వైష్ణవి, తెలుగు మీడియంలో అడివిలింగాల జెడ్పీ పాఠశాల విద్యార్థిని నాగలక్ష్మీలు ప్రథమ బహుమతిని సాధించినట్లు వారు తెలిపారు. జీవదాన్ పాఠశాల ప్రిన్సిపల్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభినందనలు



పిట్లం(జుక్కల్): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో కరాటే, కుంగ్ఫూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పిట్లం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను సోమవారం మండల విద్యాధికారి దేవీసింగ్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయికి కాచాపూర్ విద్యార్థి ఎంపిక



భిక్కనూరు: కాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చెన్నూగారి లక్ష్మణ్ రాష్ట్రస్థాయి అండర్–16 షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయికి సోమవారం ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి షాట్‌పుట్ అండర్ –16 విభాగంలో జిలా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని లక్ష్మణ్ సాధించాడు. పలువురు అభినందించారు.

గుర్తింపు క్రీడా సంఘాలు ఏవీ?

- ఒక్కో క్రీడకు ఒక్కో సంఘం చొప్పున అనుమతి
- జిల్లాలో రెండేసి చొప్పున ఏర్పాటు
- ఇష్టారాజ్యంగా క్రీడల నిర్వహణ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని క్రీడా సంఘాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఒక్కో క్రీడా విభాగానికి రెండు సంఘాల చొప్పున పుట్టుకొస్తున్నాయి. అనుమతి ఎవరికి ఉందో కూడా చెప్పలేని పరిస్థితిలో అధికారులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు ఉన్నారు. దీంతో ఏ సంఘానికి గుర్తింపు ఉందో, ఏ సంఘానికి గుర్తింపు లేదో అనే విషయం తెలియక క్రీడాకారులు అయోమయం చెందుతున్నారు. అలాగే ఆయా క్రీడా సంఘాల నిర్వాహకులు క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారుల ప్రతిభను బట్టి కాకుండా అనుకూలంగా, సన్నిహితంగా ఉండే వారిని జిల్లా, రాష్ట్రస్థాయికి పంపిస్తున్నారు. దీంతో



రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు అంతగా రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఆయా క్రీడా సంఘాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమకు అనుకూలంగా ఉన్న వారినే రాష్ట్రస్థాయికి పంపిస్తున్నారు. ఇటీవల సీనియర్ జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు ముప్కాల్‌లో నిర్వహించారు. ఎంపికై న క్రీడాకారులకు వారం పాటు శిక్షణ క్యాంపు నిర్వహించాల్సి ఉండగా, ఒక్క రోజులోనే మమ అనిపించేసి ఇంటర్, డిగ్రీ చదివే క్రీడాకారులను రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు పంపారు. వాస్తవానికి పీజీ ఆపై చదివిన క్రీడాకారులను సీనియర్ టోర్నీకి పంపించాలి. అలా కాకుండా ఇష్టారాజ్యంగా ఎంపికలు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాష్ట్ర సీనియర్ మహిళ టీమ్‌కు కోచ్‌గా కబడ్డీ కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులను పంపించాలి. అలా కాకుండా డిగ్రీ చదివే క్రీడాకారుడిని పంపడంలో ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది. ఇలానే ఉషు, హ్యాండ్‌బాల్, తైక్వాండో క్రీడల్లో సైతం జరుగుతోంది. ఇటీవల సీఎం కప్ టోర్నీకి సైతం హాకీ క్రీడాకారుల ఎంపిక అంతా గందరగోళంగా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణ గాలికి..

పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా యువజన క్రీడల అధికారి తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు. ఏ క్రీడ సంఘానికి అనుమతి ఉందో కూడా చెప్పకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇక ఒలింపిక్ సంఘం ప్రతినిధులు సైతం ఉన్నామా లేదా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో క్రీడలు, క్రీడాసంఘాల పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏ క్రీడా సంఘానికి అనుమతి ఉందో తేల్చి, ఒక క్రీడకు ఒక సంఘం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సభ్యుల మధ్య గొడవలతో..

జిల్లాలో క్రీడా సంఘాలు 42 ఉన్నాయి. ఇందులో కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఉషు, తైక్వాండో, యోగా, వాలీబాల్ తదితర క్రీడా సంఘాలు రెండేసి చొప్పున ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో క్రీడకు ఒక్క యూనియన్ మాత్రమే ఉండాలి. అలా కాకుండా జిల్లాలో యూనియన్‌లలో ఉన్న సభ్యుల మధ్య గొడవలు రావడంతో ప్రత్యేకంగా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రకాల క్రీడల్లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి క్రీడాకారులను టోర్నమెంట్‌కు తీసుకెళుతున్నారు. ఇందులో ఏ సంఘానికి అనుమతి ఉందో, ఎవరి సర్టిఫికెట్‌కు అర్హత ఉందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

బోగస్ సంఘాలపై చర్యలు..

జిల్లాలో బోగస్ సంఘాలు ఏర్పాటు చేసుకొని క్రీడాకారులను జిల్లాస్థాయిలో ఎంపికలు చేసి, రాష్ట్రస్థాయికి పంపినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. రాష్ట్రస్థాయి టోర్నీకి వెళ్లే జట్లకు కోచ్‌లుగా సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులను, కోచ్‌లను మాత్రమే పంపాలి. జూనియర్ క్రీడాకారులను పంపినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయి. – బొబ్బిలి నర్సయ్య, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి

నిబంధనలు పాటించాల్సిందే..

ఆయా క్రీడా సంఘాల నిర్వాహకులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి టోర్నీకి క్రీడాకారులను తీసుకెళితే స్పోర్ట్స్ అథారిటీ, ఒలింపిక్ సంఘం నియమనిబంధనలు పాటించాల్సిందే. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ఎంపికలు చేసినా, క్రీడాకారులకు అన్యాయం చేసినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – ముత్తెన్న, డీవైఎస్‌వో

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి

- త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటన



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

పెర్కిట్/ఆర్మూర్(ఆర్మూర్)/మాక్లూర్: పిల్లల భవిష్యత్ కోసం తపిస్తూ గడిపిన తల్లిదండ్రులను మలిదశ వృద్ధాప్యంలో ప్రేమతో ఆదరించాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఇటీవల స్వర్గస్తులైన ఆశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరం వారు పనుల్లో పడి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారు బాధ్యతాయుతంగా వ్యవహరించినపుడే అందరికి సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే ఆర్మూర్‌లోని బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. అనంతరం నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో గవర్నర్ పూజలు నిర్వహించారు.

అపురూప వేంకటేశ్వర ఆలయంలో పూజలు..



ఆలయంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గల అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. దైవదర్శనం అనంతరం బీజేపీ నాయకులు ఒక్కొక్కరుగా గవర్నర్‌ను సన్మానించారు. అంతకుముందు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా గౌరవ వందనంతో ఆయనకు స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, విజయ్ విద్యా సంస్థల చైర్మన్ అమృతలత, లాలన వృద్ధాశ్రమం చైర్మన్ సునీతరెడ్డి, టక్కరి హన్మంత్‌రెడ్డి, పెద్దోళ్ల గంగా రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పుప్పాల శివరాజ్, బద్దం లింగారెడ్డి, కంచెట్టి గంగాధర్, మదారి మమతా రాజేశ్వర్, గంగోని సంతోష్, శరత్, చింత ప్రవీణ్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, రచ్చ సుదర్శన్, శ్రీకాంత్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



నగరంలో వారాహిమాత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్వామీజీ



హోమం నిర్వహిస్తున్న స్వామీజీ, అర్చకులు

- హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి
- నగరంలో వారాహిమాత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ దైవకార్యాల్లో భాగస్వాములు కావాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతిస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని అమ్మనగర్‌లో వ్యాపారవేత్త మంచాల జ్ఞానేందర్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్మించనున్న వారాహిమాత ఆలయానికి సోమవారం విద్యారణ్యభారతి స్వామి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పాటిస్తే సమాజంలో సమస్యలు తేలికగా పరిష్కరించుకోవచ్చన్నారు. వారాహి మాత ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన జ్ఞానేందర్‌గుప్తాను అభినందించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, రాష్ట్ర నాయకుడు మాదాసు స్వామియాదవ్, అమ్మనగర్ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు పంచ రెడ్డి శ్రీకాంత్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాగన్నగారి బావిని సందర్శించిన విద్యార్థులు



నాగన్నగారి బావి వద్ద గట్టుమైసమ్మ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గట్టుమైసమ్మ తండాకు చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం విహారయాత్రలో భాగంగా చారిత్రక కట్టడం నాగన్నగారి బావిని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నాగన్నగారిబావి చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు నరేందర్ ఉన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

- కొనసాగుతున్న డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం బ్రహ్మోత్సవాలు
- పాల్గొన్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సీతారాముల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువస్తున్న రమేశ్‌రెడ్డి, భూపతిరెడ్డి, భక్తులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా దంపతులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రతియేటా మాఘ శుద్ధ త్రయోదశి రోజున సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే నేతృత్వంలో యాగ్నికులు కాండూరి భార్గవచారి, అర్చకులు గోపాలాచార్య, పంకజాచార్య, ఆర్యన్ పాండే, వైభవ్, కాకర్ల ప్రవీణ్ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే యంత్ర హోమం, బలిహరణం, అశ్వసేవ కార్యక్రమాలను నిర్వహించారు. నేడు గరుడ సేవ నిర్వహించనున్నారు. అంతకుముందు డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి సందర్శించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి వారు కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, గజవాడ చిన్నయ్య, వీడీసీ ప్రతినిధులు బూస సుదర్శన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయం అభివృద్ధికి కృషి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం అభివృద్ధికి కృషిచేస్తానని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు. వైభవంగా కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఆయన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆయనకు ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని తెలియజేశారు. రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ సభ్యులు వారికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, రామడుగు ప్రాజెక్టు, గుండారంలోని లక్ష్మాపూర్ లోని అనంత పద్మనాభస్వామి ఆలయాలను కలిపి టూరిజం హబ్‌గా మార్చి పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చే విధంగా చూస్తామన్నారు. డిచ్‌పల్లి



రమేశ్‌రెడ్డి, భూపతిరెడ్డిలకు వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు

రామాలయం చెరువుతోపాటు రామడుగు ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం కల్పించాలని రమేశ్‌రెడ్డిని కోరారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయంగానే కులగణన

- ప్రతిపక్షాల రాద్ధాంతం సరికాదు
- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్



నిజామాబాద్ నాగారం: కులగణన శాస్త్రీయంగా జరిగిందని, అయినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నగరంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సోమవారం జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈసందర్భంగా అనిల్ నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. త్వరలోనే చేనేత తదితర సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎంపీగా అర్వింద్‌ను గెలిపించినా ఆయన పద్మశాలీలకు చేసింది ఏమీ లేదన్నారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ.. సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక పద్మశాలి సమాజం అని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దీకొండ యాదగిరి, బిజ్జు దత్తాద్రి, పుల్లం హన్మాండ్లు, గుజ్జ రాజేశ్వరి, గుజ్జేటి వెంకటనర్సయ్య, రాపెల్లి గురుచరణం, గుడ్ల చంద్రబాగ, బల్ల లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ తండా సమీపంలోని జాతీయ రహదారి 44పై ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. అమృతపూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం జక్రాన్‌పల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి మక్కసొప్పను ట్రాక్టర్‌పై తీసుకువెళ్తున్నారు. పడకల్ తండా వద్ద వారి ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న సిర్నాపల్లి ఒడ్డెన్న(45), రాజేశ్వర్(46)లు అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు ముందు కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతులు డిచ్‌పల్లి మండలం అమృతపూర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన మిషన్ భగీరథ ఉద్యోగి మృతదేహం లభ్యం



కర్రె విఠల్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రం శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన మిషన్ భగీరథ ఇంట్రాసెక్షన్ హెల్పర్ కర్రె విఠల్ (44) మృతదేహం సోమవారం ఉదయం బూర్గుల్ శివారులోని డిస్ట్రిబ్యూటరీ–3 వద్ద లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన విఠల్ గ్రామ రెవెన్యూ వీఆర్ఏగా పని చేసేవాడు. గత ప్రభుత్వం వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పలు ప్రభుత్వ శాఖల్లో బదిలీ చేయగా అతడు ఎల్లారెడ్డి మండల మిషన్ భగీరథ కార్యాలయంలో హెల్పర్‌గా చేరాడు. రోజుమాదిరిగానే ఆదివారం మహమ్మద్ నగర్ శివారులోని మంజీరా ప్రధాన కాలువ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు విఠల్ వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అధికారులు నీటి విడుదలను నిలిపివేయించి కాలువలో అతడి ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించారు. కానీ సోమవారం ఉదయం మృతదేహం లభ్యం అయ్యింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వరదకాలువలో ఛత్తీస్‌గఢ్ వాసి..



బీర్‌సింగ్ (ఫైల్)

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామ శివారు లోగల వరద కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు గల్లంతైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బీర్‌సింగ్ మారాబి(40) మృతదేహం సోమవారం మధ్యాహ్నం లభ్యమైంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా.. బస్సాపూర్‌లో ఓ మేస్త్రీ వద్ద అతడు తాపీ పని చేసేవాడు. తన సెల్‌ఫోన్ మరమ్మతుల కోసం బీర్‌సింగ్ మారాబి బాల్కొండ వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ వరద కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టగా ఎక్కడ పడిపోయాడో అక్కడే మృత దేహం లభ్యమైంది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అభిషేక్ మృతదేహం

నవీపేట: మండలంలోని అబ్బాపూర్ (బి) గ్రామానికి చెందిన క్లెం అభిషేక్(17) అనే ఇంటర్ విద్యార్థి కొన్నిరోజుల కిందట ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో అభిషేక్ గతేడాది మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయ్యాడు. దీంతో అతడిని మళ్లీ అదే కాలేజీలో మొదటి సంవత్సరంలో చేర్పించారు. చదువుపై ఇష్టం లేదని.. చదువుకోనని పలుమార్లు తండ్రి సాయిలు ఎదుట అతడు రోదించిన పట్టించుకోలేదు. ఈక్రమంలో చదువుపై ఇష్టం లేక జీవితంపై విరక్తి చెంది అతడు గత నెల 27న పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించారు. కానీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని కొండూర్ శివారు లోగల వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం రెవెన్యు ఇన్‌స్పెక్టర్ గంగరాజం పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్లు సర్పల్లి తండాకు చెందిన మాలావత్ బాలాజీ, మాలావత్ భాస్కర్‌లకు చెందినవన్నారు.

‘చిలుకూరు’ అర్చకుడిపై దాడి కేసులో బోధన్ వాసి అరెస్టు

ఖలీల్‌వాడి: చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన కేసులో జిల్లాలోని బోధన్‌కు చెందిన సాయిలు అలియాస్ సాయినాథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని రాజేంధర్‌నగర్ పోలీసులు రెండు రోజుల క్రితం అతడిని అదుపులోకి తీసుకున్నారు. సాయినాథ్ ప్రస్తుతం రామరాజ్యం సంస్థ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2022 నుంచి జిల్లాలో రామరాజ్యం సంస్థ కోసం పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని దేవునిపల్లి పరిధిలోగల విద్యుత్ నగర్ కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దేవునిపల్లి పోలీసులు సోమవారం సాయంత్రం అక్కడికి వెళ్లారు. ముగ్గురు విటులను, ఓ మహిళను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.